క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తూప్రాన్: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని చిల్డ్రన్ హైస్కూల్‌కు చెందిన 2001–02 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు సీహెచ్ఎస్టీ గోల్డెన్ హాండ్స్ ట్రస్టుకు రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ట్రస్ట్ ద్వారా చేయూతను అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వరప్రసాద్, మోజెస్, ట్రస్ట్ అధ్యక్షుడు నరహరి, కార్యదర్శి సురేశ్, కోశాధికారి నగేశ్, రవికుమార్, ఇమానియల్, విజయేందర్, అఫ్రోజ్, రాజేశ్వర్, శ్రావణ్, బాబు పాల్గొన్నారు.

బంగారమ్మను దర్శించుకున్న భక్తులు

మనోహరాబాద్(తూప్రాన్): పలు గ్రామాలకు చెందిన భక్తులు ఆదివారం మండలంలోని కాళ్లకల్ బంగారమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం కావడంతో భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, బోనం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం వన భోజనాలు చేశారు. పూజారి వేణుగోపాల్‌శర్మ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారిని భక్తులు ధర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రదక్షిణలు. ఒడి బియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

వీల్‌చైర్ అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన ముంద్రాతి లక్ష్మి పక్షవాత వ్యాధిలో బాధపడుతూ నడవలేని పరిస్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివ వీకెన్ మేక్ ఏ చేంజ్ టీం అధ్యక్షుడు భార్గవ్ సహకారంతో ఆదివారం వీల్‌చైర్‌ను అందజేశారు. వృద్ధురాలి వైద్య అవసరాల కోసం సహాయం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్, అశోక్‌నాయక్, సురేష్‌గౌడ్, నర్సింహులు, సిద్ధు, సత్యం పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకుంటాం

రామాయంపేట(మెదక్): భవిష్యత్తులో సంఘం తరపున నిరుపేదలను ఆదుకోవడంతో పాటు సేవా కార్యక్రమాలను చేపడుతామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా 1987 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరస్పరం ఆప్యాయంగా పలకరించుకున్నారు. సంఘం ప్రతినిధులు శర్మ, గంగాధర్, యాదగిరి, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రమేశ్, భగీరథ ఏఈఈ భిక్షపతి పాల్గొన్నారు.

పాముకాటుతో పాడిగేదె మృతి



శివ్వంపేట(నర్సాపూర్): పాముకాటుతో పాడిగేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చండి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంటన్నగారి శేఖర్ పాడిగేదెలతో ఉపాధి పొందుతున్నాడు. రోజులాగానే పాడిగేదెలను పశువుల పాకలో ఉంచగా నాగుపాము కాటేయడంతో ఓ గేదె మృత్యువాత పడింది. దాని విలువ రూ1.60 లక్షలు ఉంటుందని రైతు చెప్పాడు.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో శ్రావణ సోమవారం పురస్కరించుకొని స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్, గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 5:00 నుంచి 7:00 వరకు పార్వతీ రామలింగేశ్వర స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అదే విధంగా మధ్యాహ్నం అన్నదానం చేశారు.

తండాలకు తీజ్ శోభ

9 రోజుల పాటు పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని పలు గిరిజన తండాల్లో తీజ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సితారం సహా పలు తండాల్లో నవరాత్రులు తీజ్ వేడుకలు నిర్వహిస్తున్నారు. యువతులు నియమ నిష్ఠలతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తే..వారనుకున్న కార్యం తప్పకుండా సిద్ధిస్తుందన్న ప్రగాఢ విశ్వాసం. దీనికి తోడు వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలనే సంకల్పంతో దేవతామూర్తులకు పూజలు నిర్వహిస్తారు.

బుట్టల్లో గోధుమలు వేసి పూజలు



పందిరిపై ఉంచిన బుట్టల్లో మొలిచిన గోధుమలు



సితారం తండాలో నిమజ్జనం ఊరేగింపు

పూజల్లో మొదటి రోజు తండాకు చెందిన యువతులు కొత్త బుట్టల్లో పుట్ట మన్ను వేసి అందులో గోధుమలను వేస్తారు. అనంతరం వాటిని ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిపైన బుట్టలను పెట్టి తొమ్మిది రోజుల పాటు పూజలు చేస్తూ రోజుకు మూడు సార్లు యువతులు నీరుపోస్తారు. తొమ్మిది రోజులకు గోధుమలు మొలకెత్తిన అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టి బాజాభజంత్రీలు, ఆటపాటలతో ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం చెరువులు, కుంటల్లో వాటిని నిమజ్జనం చేస్తారు.

దేవతామూర్తులకు పూజలు

గిరిజనుల ఆరాధ్య దైవమైన దేవతలకు తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. దీక్షల్లో ఉన్న యువతులతోపాటు తండా వాసులు సైతం పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. తుల్జాభవానీ, భద్రకాళి, సౌరాదేవి, కనకదుర్గ, సీట్ల, హీట్లా, సూర, దేవతామూర్తులను పూజలు నిర్వహిస్తారు.

అహంకారం తొలగిపోతుంది:



తీజ్ ఉత్సవాల మూలంగా మనిషిలో ఉన్న అహంకారం తొలగిపోతుంది. భక్తిబావంతో ఉండటంతో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారు. తండాల్లో భక్తి భావాలు పెరగడం శుభసూచకం. రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలనే సంకల్పంతో దేవతామూర్తులకు పూజిస్తారు.

– బుచ్యానాయక్, ఎంఈఓ

ఆటపాటలతో ఉత్సాహం:



తీజ్ వేడుకల సందర్భంగా మనుషుల్లోని మన స్పర్థలు తొలగిపోతాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు తండా వాసులందరు కలిసి ఆటలు ఆడటం, పాటలు పాడటంతో భక్తి బావం మరింతగా పెరుగుతుంది.

– కమలపూల్‌సింగ్, మాజీ జెడ్పీటీసీ

నియమ నిష్ఠలతో పూజలు:



తొమ్మిది రోజుల పాటు యువతులు నియమ నిష్ఠలతో పూజలు చేస్తారు. వారు అనుకున్న కార్యం తప్పకుండా నెరవేరుతుంది. తండాల్లో శ్రావణమాసం భక్తి భావాలకు నిలయంగా ఉంటుంది. తీజ్ వేడుకల పట్ల తండా వాసులు ఉత్సాహం చూపుతారు.

– సుశీల, అంగన్‌వాడీ టీచర్

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత నగదును కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ మాసాయిపేటలో బీజేపీ నాయకులు రైతులతో కలిసి ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ పథకం కింద రైతులకు ప్రతియేడాది ఆరువేలు రూపాయలు మూడు విడతల్లో వారి ఖాతాల్లో నేరుగా జమచేయడం వల్ల అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠ సమాజం నూతన కార్యవర్గం



మండల నీలకంఠ సమాజం నూతన కార్యవర్గం

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండల నీలకంఠ సమాజం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నీలకంఠి విఠల్, ఉపాధ్యక్షులుగా కరణం రామచందర్, కార్యదర్శిగా దయానంద్, కోశాధికారిగా కరణం మారుతి, సహాయ కార్యదర్శిగా భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీశైలం, నీలకంఠి రాజు, జగన్, పోశెట్టి, నాగరాజు, ఆగమయ్య, అనిల్‌కుమార్, ముఖ్య సలహాదారుగా నీలకంఠి ప్రశాంత్‌కుమార్ ఎన్నికయ్యారు. మూడవసారి తిరిగి తనను మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడంపై నీలకంఠి విఠల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షం మాటున వ్యర్థజలాలు విడుదల

జిన్నారం (పటాన్‌చెరు): పంటపొలాల్లోకి రసాయన వ్యర్థజలాలు విడుదల చేయడాన్ని ప్రశ్నించిన గ్రామస్తులపై పరిశ్రమ ప్రతినిధులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని గడ్డపోతారం రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో శనివారం పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలను అదునుగా తీసుకొని ఎంఎస్ఎన్ పరిశ్రమ యధేచ్ఛగా వ్యర్థజలాలను విడుదల చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలో నిర్మించిన భారీ కాలువల ద్వారా వర్షం నీటితో కలిపి బహిరంగ ప్రదేశాల్లోకి వదిలేస్తున్నారని ఆ జలాలు పక్కనే ఉన్న పంటపొలాల్లోకి చేరుతున్నాయని తెలిపారు. ఇదే విషయంపై గ్రామస్తులు, రైతులు పరిశ్రమ వద్దకు వెళ్లి ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తిస్తూ పరిశ్రమ వద్దకు వస్తే కేసులు పెడతామని, అధికారులంతా మా వైపే ఉన్నారని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అధికారులకు వివరించారు. గత సంవత్సరం వ్యర్థజలాలు సేవించి 20కి పైగా గేదెలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగిన పరిశ్రమ తీరు మారకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే నిత్యం విషవాయువులు, వ్యర్థజలాలతో సతమతమతున్నా.. పంటపొలాల్లో కూడా అదే పరిస్థితి నెలకొందని వాపోయారు. వ్యర్థలను విడుదల చేస్తున్న ఎంఎస్ఎన్ పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని పీసీబీ ఈఈ కుమార్ పాఠక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్జున్, చిరంజీవి, నవీన్, ఉపేందర్ పాల్గొన్నారు.



పీసీబీ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

మహాసభను విజయవంతం చేయండి

హత్నూర(సంగారెడ్డి): ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే వికలాంగుల మహా పింఛన్ల గర్జన సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తల్లి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చంద్ర మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం హత్నూరలో నల్లోల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్ 31వ సంవత్సర ఆవిర్భావ వేడుకలో ముఖ్య అతిథిగా మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగపాల్గొని మాట్లాడారు. 31 సంవత్సరాల ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ స్ఫూర్తితో మాదిగలు ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చిన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించడం శుభ పరిణామం అన్నారు. వికలాంగుల చేయూత పెన్షన్ల మహాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు, ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లోల్ల మొగులయ్య మాదిగ ,సీనియర్ నాయకులు మచ్చురి సాయిలు , ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి, నల్లోల్ల ప్రవీణ్ కుమార్ ,నాయకులు , నల్లోల్ల పెంటయ్య , ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

మెదక్‌కలెక్టరేట్: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) 25వ ఆవిర్భావ వేడుకలు జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు పద్మారావు ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్రకమిటీ సభ్యుడు భీమ్లానాయక్, కార్యదర్శులు సుధాకర్, ఏసయ్య, పోచయ్య మెదక్ మండల అధ్యక్షుడు గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మంటలు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వర్షానికి మంటలు చెలరేగగా.. అక్కడే ఉన్న విద్యుత్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. గంటసేపు శ్రమించి మంటలను ఆర్పారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

చెత్త తొలగించారు.. దారి కల్పించారు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలోని ఒకటో వార్డు నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోవడంతో స్థానికులు సోసైటీ డైరెక్టర్ మైలారం బాబు దృష్టికి తీసుకుపోయారు. ఆయన నార్సింగి పంచాయతీ ఈఓ నాగభూషణానికి తెలపడంతో స్పందించిన ఆయన చెత్తాచెదారం తొలగించారు. కుంట కాలువ నీరు వెళ్లేలా పైపులు వేసి దారి ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

లయన్స్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ నిర్వహించారు. ఈసందర్భంగా స్నేహితులు ఒకరితో ఒకరికి స్నేహితుల కంకణం కట్టించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రతినిధులు నాగరాజు, లింగమయార్తి, నర్సింలు, సుఖేందర్, రాంచంద్రం, నాగరాజు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

దిక్కుతోచని స్థితిలో నిరుపేద కుటుంబం

దాతల ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు ఛిద్రమై ఆస్పత్రిలో చేరిన రమేష్ పరిస్థితి దయనీయంగా ఉంది. చికిత్స భాగంగా కాలును తొలగించిన డాక్టర్లు ప్రాణాలను కాపాడారు. అత్యవసరంగా ఆపరేషన్ కావడంతో ఆస్పత్రి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. మరో కాలుకు శస్త్ర చేయగా, ఇందుకు ఆస్పత్రి బిల్లు రూ.3 లక్షల వరకు అయింది. బిల్లు చెల్లించేందుకు స్థోమత లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన నిరుపేద కుటుంబం దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది.



రమేష్ కాలుకు శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

నల్లపోచమ్మ ఆలయంలో పూజలు



తునికి నల్లపోచమ్మదేవి దర్శనం చేసుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్ , ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేష్, విఘ్నేష్ శ్రీనల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేసి అమ్మవారిని అలంకరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీశారు. ఒడి బియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు లేకుండ ఏర్పాట్లు చేశారు.

బీసీ హాస్టల్‌లో విద్యార్థులపై వేధింపులు

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులకు మంచి వసతి కల్పించి, విద్యాబుద్ధులు నేర్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం.. కొందరు అధికారుల పనితీరుతో నీరుగారిపోతుంది. కొల్చారంలోని బీసీ వసతిగృహం విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం రాత్రి 10వ తరగతి విద్యార్థి , 9వతరగతి విద్యార్థిని వేధింపులకు గురి చేశాడు. దీంతో సదరు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో ఆదివారం వారు వసతి గృహం వద్ద ఆందోళన చేసి హాస్టల్ వార్డెన్ ఉమారాణితో వాగ్వాదానికి దిగారు. హాస్టల్‌లో వసతి కోసం వచ్చిన విద్యార్థులను జాయిన్ చేసుకోకుండా పంపించి వేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హాస్టల్ వంట మనిషి భోజనం పెట్టకుండా బూతులు తిడుతూ, దుర్భాషలాడుతుందని విద్యార్థులు ఆరోపించారు. అలాగే కావాలా దారి నర్సింలు ప్రతి విషయంలో కలగజేసుకొని వసతి గృహ అధికారి విధులను నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వసతి గృహ అధికారి, కాపాలాదారు నర్సింలు, వంటమనిషిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించాం

ఈ విషయమై హాస్టల్ వార్డెన్ ఉమారాణిని సాక్షి ఫోన్ ద్వారా సంప్రదించగా ఇబ్బందులకు గురిచేసిన విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించి హాస్టల్ నుంచి పంపించినట్లు తెలిపారు.

బండరాళ్ల ధరలు తగ్గించాలి

లబోదిబోమంటున్న ఇందిరమ్మ లబ్ధిదారులు

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ లబ్దిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే నిర్మాణ సామగ్రిని అందించాలని అధికారుల ఆదేశాలున్నప్పటికి బండరాళ్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నార్సింగి మండల కేంద్రంలోని మల్లన్న గుట్ట వద్ద బండరాళ్లను పగలకొట్టి ఇంటి నిర్మాణం కోసం అందిస్తున్నారు. నెల రోజుల్లోనే బండరాళ్ల ధరలను పెంచి అమ్ముతుండటంతో ఇందిరమ్మ లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇళ్ల నిర్మాణం మొదలు కాకముందు మాములు బండరాయి రూ.16, హైడర్ బండరాయి ధర రూ.25కు అందించేవారు. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల పనులు మొదలు కావడంతో రాళ్ల ధరలను అమాంతం పెంచేశారు. మాములు బండరాయి ధర రూ.25కు, హైడర్ బండరాయి ధరను రూ.35 పెంచారు. దీంతో ఒక్క రాయికి అదనంగా రూ.10 పెంచడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. అ ధికారులు స్పందించి ధరలను నియంత్రించాలని కోరుతున్నారు.

పాదయాత్రగా కేతకీకి తరలిన భక్తులు



పాదయాత్రగా ఆలయానికి తరలిన భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): కర్నాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు ఆదివారం భజనలు చేసుకుంటూ పాదయాత్రగా మండల కేంద్రం ఝరాసంగంలోని కేతకీ ఆలయానికి తరలివెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ 600 మంది భక్తులు బయలుదేరారు. ఆదివారం న్యాల్‌కల్ మండలంలోని మల్గి, డప్పూర్, అత్నూర్, న్యాల్‌కల్, రుక్మాపూర్‌ల మీదుగా ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయానికి పాదయాత్రను కొనసాగించారు. ఆదివారం రాత్రికి ఆలయానికి చేరుకొని స్వామి వారికి ఇష్ట దినమైన సోమవారం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటామని చెప్పారు. పాదయాత్రన తరలిన భక్తులకు అత్నూర్ గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

బీజేపీతోనే గ్రామీణ వికాసం

నారాయణఖేడ్: గ్రామీణ ప్రాంతాల వికాసం బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖేడ్‌లో బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తుందని ఆరోపించారు. కేంద్రం గ్రామ పంచాయతీలకు సైతం సకాలంలో నిధులను విడుదల చేస్తుందని, ఉజ్వల యోజన ద్వారా పేద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పత్తిరి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దశరథ్, బీజేపీ నాయకులు మేకల జ్ఞానేశ్వర్, సుగుణాకర్ ఉన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిసున్న నాయకులు

గుంతలమయంగా పరిశ్రమల వాడ రోడ్లు

పట్టించుకునే నాథులు కరువు, ఇబ్బందులు పడుతున్న భారీ వాహనదారులు

మనోహరాబాద్(తూప్రాన్): నిత్యం భారీ వాహనాలు, ప్రయాణికులు, కార్మికులతో నిత్యం రద్దీగా ఉన్న రోడ్లు గుంతల మయంగా మారడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ , ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమల వాడల మధ్య గల ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాల పాలవుతున్నారు. కార్మికులు పనులు ముగించుకుని ఇంటికి రావాలంటే వారికి పాట్లు తప్పడం లేదు. ఇట్టి పరిశ్రమల రోడ్లను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



చిరు వర్షానికి కుంటలుగా మారిన కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమల వాడ రోడ్డు

పై అధికారుల దృష్టికి తీసుకెళుతాం

పరిశ్రమల వాడలకు సంబంధించిన గ్రామాల రహదారుల మరమ్మతుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతాం. త్వరలోనే మరమ్మతులు జరిగేలా కృషి చేస్తాం.

–ఎంపీడీఓ రవీందర్, మనోహరాబాద్